సాక్షి
అనంతపురం
ఆదివారం । 23 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.32 వేలు పలికాయి.



క్రికెట్‌లో అదుర్స్

ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు క్రికెట్‌లో రాణిస్తున్నారు. ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.6°/23.8°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల 6వ సెమిస్టర్ ఫలితాలను శనివారం ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరీక్ష ఫలితాల్లో ఆర్ట్స్ విభాగంలో 94 శాతం, కామర్స్‌లో 99 శాతం, సైన్స్‌లో 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి తెలిపారు. అలాగే రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను కూడా విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్కే యూనివర్సిటీ ఎగ్జామ్స్ డీన్ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ లోకేష్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చలపతి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో ఈనెల 24 సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శనివారం తెలిపారు. ప్రజలు తమ అర్జీ వెంట ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు తీసుకురావాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ఈ ఏడాది మార్చి 16న విడుదలైంది. ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలులో భాగంగా అప్పటి నుంచి ప్రజల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని నిలిపివేశారు. మూడు నెలల 10 రోజుల తరువాత తిరిగి కార్యక్రమం ప్రారంభం కానుంది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై దాడి



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇంటి వద్ద అల్లరి చేస్తున్న టీడీపీ శ్రేణులు

శెట్టూరు: యర్రబోరేపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై టీడీపీ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. బాధితులు తెలిపిన మేరకు... సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం అర్ధరాత్రి గ్రామంలో డీజే నిర్వహించారు. ఈలలు, కేకలు వేసుకుంటూ వీధులన్నీ కలియదిరిగారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వడ్డే అంజినేయులు, మహేంద్ర ఇళ్ల వద్దకు వచ్చినపుడు టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై రాళ్లు రువ్వారు. ర్యాలీ ముందుకెళ్లిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి గ్రామ పెద్దలతో రాళ్ల దాడి మంచిది కాదని చర్చించారు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు మళ్లీ వెనుకకు వచ్చి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను దుర్భాషలాడుతూ దాడికి యత్నించారు. గ్రామపెద్దలు, పోలీసులు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అంజినేయులు, మహేంద్ర, టీడీపీ కార్యకర్తలు విజయకుమార్, మల్లికార్జునపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

జబ్బుల జీవనం!



- ఉమ్మడి అనంతలో భారీగా పెరిగిన జీవన శైలి వ్యాధుల బాధితులు
- వ్యాయామం చేయకపోవడంతోనే సమస్యలు
- 18 ఏళ్లు దాటగానే శారీరక శ్రమ ఉండాల్సిందేనంటోన్న వైద్యులు

❒ గుంతకల్లుకు చెందిన పద్మలతకు 33 ఏళ్లు. ఇద్దరు పిల్లలున్నారు. వారం రోజుల క్రితం ఈమెకు గుండెపోటు రాగా,బంధువులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే, చికిత్స ఫలించక మృతి చెందింది.

❒ అనంతపురం సమీపంలోని రుద్రంపేటకు చెందిన ఓ ప్రైవేటు టీచర్ నెల రోజుల క్రితం గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఆయన వయసు 44 ఏళ్లు. ఇంటర్, టెన్త్ క్లాస్ చదివే పిల్లలున్నారు. పనిఒత్తిడి కారణంగా ఈయన గుండెపోటుకు గురై మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

గడిచిన నాలుగేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరోగ్యశ్రీలో జరిగిన గుండె జబ్బుల చికిత్సల వివరాలు

కార్డియో.. కార్డియో థొరాసిక్ సర్జరీలు	10,621
దీనికోసం చేసిన వ్యయం	రూ.65.75 కోట్లు
స్టెంట్‌లు, యాంజియో గ్రామ్‌లు	18,276
ప్రభుత్వం చేసిన వ్యయం	రూ.63.58 కోట్లు
ప్రైవేటు.. ఇన్సూరెన్స్‌లో జరిగినవి	22,500
బాధితులకు అయిన ఖర్చు	రూ.130.50 కోట్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లా అయిన ఉమ్మడి అనంతపురంలో కూడా కొన్నేళ్లుగా జీవనశైలి జబ్బులు పెరుగుతున్నట్లు తేలింది. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ వ్యాధులు ఇప్పుడు పల్లెలనూ కలవరపాటుకు గురిచేస్తున్నాయి. దీంతో ఆర్థికంగా వేలాది కుటుంబాలు చితికిపోతున్నాయి. వ్యాయామం చేయకపోవడంతో చేజేతులారా వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వారానికి కనీసం 150 నిమిషాలు

జీవనశైలి వ్యాధులు దరిచేరకూడదనుకుంటే వ్యాయామం మినహా మరో దారి లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) చెబుతోంది. డబ్ల్యూహెచ్ఓ నిబంధనల ప్రకారం 18 ఏళ్ల వయసు దాటిన వారు విధిగా వ్యాయామం చేయాలి. వారానికి కనీసం 150 నిమిషాలు వ్యాయామం చేయాల్సి ఉంటుంది. యోగా, సైక్లింగ్ తదితర వాటి వల్ల ఆక్సిజన్ ఎక్కువగా శరీరంలోకి చేరుతుంది. దీంతో అధిక రక్తపోటు, బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం, మధుమేహం, క్యాన్సర్, వంటి వ్యాధులు దగ్గరికి రావు. అయితే, అవగాహన లేక కొందరు, బద్ధకంతో మరికొందరు పట్టించుకోకపోవడంతోనే జీవనశైలి జబ్బుల బారిన పడుతున్న వారు రోజు రోజుకూ పెరుగుతున్నట్టు డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. రోజూ వ్యాయామం తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచిస్తోంది.

ప్రమాదం ఎవరికి, ఎంతంటే..?

రోజూ వ్యాయామం చేసేవారికంటే చేయని వారిలో ప్రమాద అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 21 శాతం నుంచి 25 శాతం మందిలో రొమ్ము క్యాన్సర్, కొలనో క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువ. అలాగే మధుమేహం వచ్చే అవకాశం 27 శాతం మందిలో అధికంగా ఉంటుంది. గుండె జబ్బుల ప్రమాదం 30 శాతం మందిలో ఎక్కువగా ఉన్నట్టు తేలింది. శారీరక వ్యాయామం ద్వారా బరువు నియంత్రణలో ఉండటంతో జీవనశైలి జబ్బుల నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. దీంతో పాటు సమతులాహారం తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో భిన్నమైన పరిస్థితులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యాయామంపై అవగాహన లేకపోవడం, రకరకాల ఆహారపు అలవాట్ల కారణంగా జీవనశైలి జబ్బులకు గురవుతున్న వారి సంఖ్య తీవ్రంగా ఉన్నట్టు కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ నివేదికలో వెల్లడైంది. సగటున 45 శాతం మంది వయసుకు తగ్గ బరువు కంటే ఎక్కువగా ఉన్నట్టు తేలింది. 2004తో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో నేడు జీవనశైలి బాధితుల సంఖ్య 43 శాతం పెరిగినట్టు తెలిసింది. ఎక్కువ మంది స్థూలకాయ సమస్యతో బాధపడుతున్నారు. ఇక డయాబెటిక్, రక్తపోటు సమస్యలతో బాధపడుతున్న వారు 20 శాతం మందికంటే ఎక్కువగా ఉన్నారు.

శారీరక వ్యాయామం తప్పనిసరి



గుండెపోటుకు గురవుతున్న వారి సంఖ్య ఇటీవల పెరిగిపోయింది. ఇందుకు ప్రధాన కారణం పొగ తాగడం, మద్యం సేవించడం. ఎలాంటి వ్యాయామం లేకుండా ఉండటం అనేది పొగ తాగడంతో సమానమే. వీళ్లలో ఊపిరితిత్తుల పనితీరు సరిగా ఉండదు. 20 ఏళ్లు దాటగానే శారీరక వ్యాయామం తప్పనిసరి. ధూమపానానికి దూరంగా ఉంటే గుండె జబ్బులు నియంత్రించవచ్చు.

– డాక్టర్ వంశీకృష్ణ, హృద్రోగ నిపుణులు, అనంతపురం

నాణ్యమైన విద్య అందించాలి



స్టూడెంట్స్ కిట్స్‌ను పరిశీలిస్తున్న డీఈఓ వరలక్ష్మి, అధికారులు

కళ్యాణదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని డీఈఓ వరలక్ష్మి సూచించారు. కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నియోజకవర్గంలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మిషన్ లైఫ్ యాక్టివిటీస్, యూడైస్ గురించి డీఈఓ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడా విద్యార్థుల డ్రాపౌట్స్ ఉండకూడదన్నారు. వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో అందుతున్న విద్యను వివరించాలన్నారు. ప్రతి విద్యార్థినీ మంచి నడవడికతో పాటు ప్రయోజకుడిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. సమయపాలన పాటిస్తూ పాఠశాల రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యత విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఎంఈఓలు విజయకుమారి, బాబుతో పాటు పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేషనల్ రెఫరీగా రామాంజనేయులు



అనంతపురం: ఆలిండియా తైక్వాండో పోలీస్ జూడో క్లస్టర్–2024 పోటీలు ఈ నెల 25 నుంచి 27 వరకు అసోం రాష్ట్రం గౌహతిలో జరగనున్నాయి. ఈ పోటీలకు నేషనల్ రెఫరీగా మల్లెల రామాంజనేయులు ఎంపికయ్యారు. ఈయన అనంతపురం హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్ పార్కులో తైక్వాండో అకాడమీ నిర్వహిస్తున్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండండి

- వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోండి
- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
- ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో సీఈఓ నిధియాదేవి, కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం అర్బన్: డయేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అతిసార వ్యాధితో ఏ ఒక్కరూ బాధపడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై క్యాంపెయిన్ చేపట్టాలని ఆదేశించారు. పిల్లలకు డయేరియా సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి పరిశుభ్రత, కాలుష్యం, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి డయేరియా కేసులను అరికట్టాలన్నారు. జిల్లా స్థాయిలో నగర పాలక సంస్థ కమిషనర్, జెడ్పీ సీఈఓ, డీఎంహెచ్ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీసీహెచ్ఎస్, ఇతర అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేపట్టాలన్నారు. మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, మునిసిపల్ ఆర్డీ పీవీఎస్ఎన్ మూర్తి, డీపీఓ ప్రభాకర్‌రావు, డీఎంహెచ్ఓ ఈబీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, జిల్లా మలేరియా అధికారి ఓబుళు, డీఐఓ యుగంధర్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బోడిగానిపల్లివాసులకు పరిహారం అందించాలి

'జాతీయ రహదారి 544–డీ నిర్మాణ క్రమంలో నివాసాలను కోల్పోతున్న బుక్కరాయసముద్రం మండలం బోడిగానిదొడ్డి గ్రామస్తులకు ఎన్‌హెచ్ఏఐ చట్టం ప్రకారం పరిహారం అందించాలి. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టండి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడిగానిదొడ్డి గ్రామంలో సర్వే నంబరు 112–2లో 0.60 ఎకరాల భూమి అవార్డు అయ్యాక నష్ట పరిహారం అందించాల్సి ఉందన్నారు. ఇళ్లు, భూమి కోల్పోయిన వారితో మాట్లాడి చట్టం ప్రకారం నష్ట పరిహారం అందించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఎన్‌హెచ్ఏఐ పీడీ తరుణ్‌కుమార్, అనంతపురం ఆర్డీఓ జి.వెంకటేష్, ఇతర అధికారులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

'సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్'కు దరఖాస్తులు

అనంతపురం అర్బన్: సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. వివరాలను శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు, సంస్థలు చేసిన అద్భుతమైన కృషిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం 'సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్' పేరుతో వార్షిక అవార్డు అందిస్తోందన్నారు. ఏటా జనవరి 23న సంస్థకైతే రూ.51 లక్షలు, వ్యక్తికి రూ.5 లక్షల నగదు పురస్కారాలను అందజేస్తారన్నారు. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారం https://awards.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలని సూచించారు.

అపరిమితంగా ఇంజినీరింగ్ సీట్లు

- ఇప్పటి వరకు ఒక్కో బ్రాంచ్‌లో గరిష్టంగా 240 సీట్లు
- సీలింగ్‌ను తొలగించిన ఏఐసీటీఈ
- మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల ఆధారంగా సెక్షన్ల మంజూరు



అనంతపురం: ఇంజినీరింగ్ కోర్సుల్లో అపరిమితంగా సీట్లు భర్తీ చేసుకునేలా ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి సీట్ల పరిమితిని ఎత్తివేసింది. కళాశాల యాజమాన్యాలు అదనపు బ్రాంచులకు అనుమతులు తీసుకుంటున్నాయి. మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల ఆధారంగా అదనపు కోర్సుల ఏర్పాటుకు అనుమతులు ఇస్తుండడంతో చాలా కళాశాలలు దరఖాస్తు చేశాయి. కొన్ని కళాశాలలకు ఇప్పటికే అనుమతి లభించింది.

నూతన విద్యా విధానానికి అనుగుణంగా..

ఇప్పటి వరకు ఉన్న విద్యా విధానం ప్రకారం ఒక్కో బ్రాంచ్‌లో గరిష్టంగా 240 సీట్లకే పరిమితి ఉంది. అయితే, నూతన జాతీయ విద్యా విధానం –2020కు అనుగుణంగా ఈ పరిమితిని ఏఐసీటీఈ తొలగించింది. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (స్థూల ప్రవేశాల నిష్పత్తి), డిమాండ్ మేరకు సీట్లు పెంచుకోవచ్చు. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో ఇప్పటికే 89 ఇంజినీరింగ్ కళాశాలలు దరఖాస్తు చేయగా, 75 కళాశాలలకు ఏఐసీటీఈ గుర్తింపు లభించింది. తక్కిన 14 ఇంజినీరింగ్ కళాశాలలకు గుర్తింపు రావాల్సి ఉంది. మౌలిక సదుపాయాల పరిశీలనకు ఏఐసీటీఈ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాలను అమలు చేస్తోంది. కంప్యూటర్ సైన్సెస్ (సీఎస్ఈ) బ్రాంచ్‌కు డిమాండ్ అధికంగా ఉండడంతో కళాశాలలన్నీ దాదాపుగా ఇందులోనే అదనపు సెక్షన్లకు దరఖాస్తు చేశాయి. కొన్ని సీఎస్ఈతో పాటు ఈసీఈకి అనుమతి తీసుకుంటున్నాయి.

పెరగనున్న కన్వీనర్ కోటా..

ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో ఇప్పటికే సీట్లు అధికంగా ఉన్నాయి. అయితే, ఒక్కో కళాశాలలో 1,000 సీట్లు ఉంటే, ఇందులో 650 కంప్యూటర్ సైన్సెస్, వాటి అనుబంధ కోర్సుల్లోనే ఉన్నాయి.కంప్యూటర్ సైన్సెస్‌కు విపరీతమైన డిమాండ్ పెరగడమే ఇందుకు కారణం. తల్లిదండ్రులు బలవంతంగా కంప్యూటర్ సైన్సెస్ కోర్సులో చేరేలా విద్యార్థులను ప్రేరేపిస్తుండడంతో అయిష్టంగానే తీసుకుంటున్నారు. మరి కొన్ని కళాశాలలు కంప్యూటర్ సైన్సెస్‌లో అదనపు సెక్షన్లకు అనుమతి తీసుకుంటున్నాయి. ఈ దఫా ఏఐసీటీఈ అదనపు సెక్షన్లు ఇవ్వనుండడంతో కన్వీనర్ కోటా కింద సీట్లు మరింత పెరగనున్నాయి.

అధునాతన కోర్సుల్లోనూ..

ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలు అధునాతన కోర్సుల్లోనూ సీట్లు పెంచుకుంటున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మెషిన్ లర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి వాటిల్లోనూ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఎమర్జింగ్ కోర్సుల్లో ఉద్యోగావకాశాలు పెరుగుతాయనే అంచనాలు ఉండటం, విద్యార్థుల నుంచి డిమాండ్ వస్తుందనే ఉద్దేశంతో కొన్ని కళాశాలలు సీఎస్ఈలో వీటిని తీసుకొచ్చాయి. మరికొన్ని కళాశాలలు సీఎస్ఈతో సంబంధం లేకుండా నేరుగా బ్రాంచ్‌లు నిర్వహించేందుకు ముందుకువచ్చాయి.

'సంధ్యా రవళి'.. పులకించిన మది



కళాకారుల నృత్య ప్రదర్శన



సర్టిఫికెట్లతో కళాకారులను సత్కరించిన అతిథులు

అనంతపురం కల్చరల్: వివిధ రాష్ట్రాల సంస్కృతులు.. నాట్య సంప్రదాయాలు కళ్లకు కట్టారు. కళా ప్రతిభతో పులకింపజేశారు. శనివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సంధ్యారవళి నృత్యోత్సవం నయనమనోహరంగా సాగింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పలువురు కళాకారులు విచ్చేసి నాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నిర్విరామంగా 12 గంటలు సాగిన కార్యక్రమంలో గుజరాత్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు కళాకారులు భరత నాట్యం, కూచిపూడి, సెమీ క్లాసికల్, ఫోక్ ప్రదర్శనలతో అలరించారు. మహాలక్ష్మి బృందం శాస్త్రీయ, జానపద నృత్య రీతులను అద్భుతంగా ప్రదర్శించి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ఏడుపదుల వయసులోనూ సంధ్యామూర్తి నాట్యం చేసి ఉత్సాహం నింపారు. కళాకారులు , గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు కత్తి విజయ్‌కుమార్ సంధ్యామూర్తి చిత్రాన్ని కళ్లకు కట్టినట్లు గీసి శెభాష్ అనిపించారు.

సంధ్యామూర్తికి పద్మశ్రీ ఇవ్వాలి

ముందుగా జరిగిన ప్రారంభోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించిన సంధ్యామూర్తికి పద్మశ్రీ అవార్డు ప్రకటించాలని కోరారు. చిన్నారుల్లో ఉండే కళలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఆచార్య సుధాకర బాబు, సామాజిక సేవా కార్యకర్తలు ఏజీ ప్రమీళమ్మ, రవికాంత్‌రమణ, సాయిట్రస్టు విజయ్‌కుమార్, నాగినీ ప్రసాద్, అడ్వకేట్ హోసూరు రామసుబ్రమణ్యం, డాక్టర్ బాలా కుమారి, కవి నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారిణి

వైఎస్సార్ ఆశీస్సులతో 'ఏరువాక'

కుందుర్పి: తమ్మయ్యదొడ్డి గ్రామ రైతు తమ్మయ్యకు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంటే ఎనలేని అభిమానం. ఆయన మరణించినప్పటి నుంచి ఏటా ఖరీఫ్ సీజన్‌లో ఏరువాక రోజున వైఎస్సార్ ఆశీస్సులతో సాగు చేపడుతున్నాడు. అందులో భాగంగానే శనివారం వృషభాలను, వ్యవసాయ పనిముట్లను అలంకరించి.. వైఎస్సార్ చిత్రపటానికి క్షీరాభిషేకం, పూజలు చేసిన తర్వాత పొలం పనులు ప్రారంభించాడు. వ్యవసాయరంగానికి ఎనలేని సేవలందించి రైతు పక్షపాతిగా వైఎస్సార్ నిలిచారని, అందుకే ఆయనంటే తనకు అభిమానమని తమ్మయ్య తెలిపాడు.


వైఎస్సార్ చిత్రపటానికి పూజలు చేసి వ్యవసాయానికి సిద్ధమైన తమ్మయ్య

క్రికెట్‌లో అదుర్స్

- ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ
- రంజీ, దేశవాళీ పోటీల్లోనూ రాణింపు
- ఆర్డీటీ అండతో అంతర్జాతీయస్థాయికి..



అనంతపురం: క్రేజీ గేమ్ అయిన క్రికెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు అదరగొడుతున్నారు. రంజీ, దేశవాళీ పోటీల్లోనూ రాణిస్తున్నారు. ఐపీఎల్ రాకతో గ్రామీణ ప్రాంతాలకు కూడా క్రికెట్ చేరువైంది. 20 సంవత్సరాల క్రితంతో పోలిస్తే ఇప్పుడు భారతీయ క్రికెట్‌లో వందలాదిగా క్రీడాకారులు మేమున్నామంటూ ముందుకు వస్తున్నారు. బ్యాట్‌తో పరుగుల వరద పారిస్తూ.. బాల్‌ను తిప్పేస్తూ రోజుకో ఆటగాడు తెర మీదకొస్తున్నాడు. పురుషులే కాదు మహిళలు కూడా తాము ఎందులోనూ తీసిపోమని సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ఆర్డీటీ అండదండలు అందిస్తోంది. మరికొంత మంది స్వతహాగా క్రికెట్‌లో మెలకువలు నేర్చుకుని రాణిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనంతపురం క్రికెట్ క్రీడాకారులు మెరుస్తున్నారు.

ఏపీఎల్‌లో సెంచరీ సాధించిన డీబీ ప్రశాంత్



డీబీ ప్రశాంత్ కుమార్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో సెంచరీ సాధించిన ఆటగాడిగా గుర్తింపు దక్కించుకున్నాడు. రంజీ ట్రోఫీలో 65 మ్యాచ్‌లు ఆడిన అనుభవం. హిమాచల్‌ప్రదేశ్‌పై ఆడిన మ్యాచ్‌లో 199 పరుగులు సాధించడం గమనార్హం. కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అయిన డీబీ ప్రశాంత్ కుమార్ ఏపీఎల్‌లో రాయలసీమ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

ఐపీఎల్‌కు అడుగు దూరంలో హనీష్



ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టు ట్రయల్స్ వరకు కోగటం హనీష్ వీరారెడ్డి వెళ్లాడు. ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మెన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆంధ్రప్రీమియర్ లీగ్, అండర్-19 జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో గోదావరి టైటాన్స్‌పై ఏకంగా 92 పరుగులు సాధించాడు. అండర్-16లో రాజస్తాన్ జట్టుపై సత్తా చాటి గణనీయమైన స్కోరు చేశాడు.

వికెట్ల వీరుడు మల్లికార్జున



రాప్తాడుకు చెందిన జి.మల్లికార్జున ఎడమ చేతి స్పిన్నర్‌గా రాణిస్తున్నారు. ఆంధ్ర తరఫున అండర్-16లో సిక్కింపై 8, గోవాపై 7 వికెట్లు, అండర్- 19 కేటగిరిలో బెంగాల్‌పై 7 వికెట్లు తీసి ఉత్తమ బౌలర్‌గా గుర్తింపు దక్కించుకున్నాడు. బీసీసీఐ అండర్ -16 టోర్నీలో 38 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు తీసిన రెండో క్రీడాకారుడిగా నిలిచాడు. ఏపీఎల్‌లో ప్రస్తుతం వైజాగ్ వారియర్స్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

ఆల్‌రౌండర్ షోయబ్ మహమ్మద్ ఖాన్



శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన షోయబ్ మహమ్మద్ ఖాన్ కుడి చేతి స్పిన్నర్. రంజీ ట్రోఫీలో 28 మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. ఒకే మ్యాచ్‌లో 6 వికెట్లు తీసి ప్రతిభ చాటాడు. మిడిల్ ఆర్డర్‌లో కుడి చేతి బ్యాట్స్‌మెన్‌గానూ రాణిస్తున్నాడు.

ఆంధ్రా కెప్టెన్‌గా గిరినాథరెడ్డి



రంజీ ట్రోఫీలో గిరినాథరెడ్డి ప్రాతినిధ్యం వహించాడు. అండర్-25 విభాగంలో ఆంధ్రప్రదేశ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఏపీఎల్‌లో రాయలసీమ కింగ్స్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. గతేడాది వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. గిరినాథరెడ్డి కుడిచేతి బ్యాట్స్‌మెన్, మీడియం పేస్ బౌలింగ్‌లో రాణిస్తున్నాడు. అండర్-23లో మధ్యప్రదేశ్ జట్టుపై 25 పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీసిన రికార్డు ఉంది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన గిరినాథరెడ్డి మంచి కెప్టెన్‌గా గుర్తింపు దక్కించుకున్నాడు.

దత్తారెడ్డి ప్రతిభ



ఆంధ్ర తరఫున అండర్-19 విభాగంలో హర్యానాపై మచ్చా దత్తారెడ్డి 172 పరుగులు సాధించి రికార్డు సృష్టించాడు. మణిపూర్‌పై 105 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వికెట్ కీపర్‌గాను, బ్యాట్స్‌మెన్‌గాను అద్వితీయ ప్రతిభ కనబరుస్తున్నాడు. అండర్-23లో గోవాపై 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రస్తుతం ఏపీఎల్‌లో బెజవాడ టైగర్స్ జట్టు తరఫున ఆడుతున్నాడు. కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా సత్తా చాటుతున్నాడు.

పరుగుల వరద.. అర్జున్



కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా అర్జున్ టెండూల్కర్ సత్తా చాటుతున్నాడు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో వైజాగ్ వారియర్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. అండర్- 19 కేటగిరిలో జిల్లా తరఫున కడప జట్టు మీద ఆడి 308 పరుగులు, తూర్పు గోదావరి జట్టు మీద 208 పరుగులు, చిత్తూరు జట్టు మీద 236 పరుగులు చేసి రికార్డు నెలకొల్పాడు.

పూర్వ విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్లు



జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌తో పూర్వ విద్యార్థులు



అనంతపురం: పూర్వ విద్యార్థులు కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్ లాంటి వారని యూపీఎస్సీ మాజీ సభ్యులు డాక్టర్ వై. వెంకట్రామిరెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో 1994–98 బ్యాచ్‌లో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. ముఖ్య అతిథి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కళాశాలకు పట్టుకొమ్మల్లాంటి వారు పూర్వ విద్యార్థులేనని పేర్కొన్నారు. ఇప్పుడు చదువుతున్న విద్యార్థులకు మీ అనుభవాలు, సలహాలు ఎప్పటికీ ఉండాలని కోరారు. పూర్వ విద్యార్థుల సంఘం కళాశాలకు బలం అని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ మాట్లాడుతూ ఇక్కడ ఇంజినీరింగ్ చదువుకున్న ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. తద్వారా కళాశాలకు జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు వచ్చాయన్నారు. యూనివర్సిటీ పురోగతికి పూర్వ విద్యార్థుల సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలలో చదివిన వారు గొప్ప పదవుల్లో ఉన్నారన్నారు. చాలా నిబద్ధత గల విద్యార్థులు ఉండడమే ఇందుకు కారణమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను సత్కరించారు. అప్పటి ప్రొఫెసర్ అయిన డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రొఫెసర్ శోభాబిందు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, డాక్టర్ జి.మమత, డాక్టర్ కేఎఫ్ భారతి, అజిత, డాక్టర్ కళ్యాణి రాధ, పూర్వ విద్యార్థులు మల్లికారెడ్డి, మనీష్ పంపత్వార్ (డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్షియల్ ప్లానింగ్), సాయి కిరణ్ (సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సస్టైనబులిటీ సొల్యూషన్స్), కిరణ్ నల్లగొండ (సీనియర్ ప్రిన్సిపాల్ ఆర్కిటెక్ట్) తదితరులు పాల్గొన్నారు.

రష్యా దేశంలో జిల్లా చరిత్ర


'అనంతపురం ద జెమ్ ఆఫ్ రాయలసీమ' పుస్తకాన్ని చూపుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: జిల్లా ఖ్యాతి విశ్వవ్యాప్తమైంది. రష్యాలో ఉన్న బ్రిక్స్ లైబ్రరీలో అనంతపురం చరిత్రకు సంబంధించిన ప్రత్యేక పుస్తకం అందుబాటులోకి వచ్చింది. 'అనంతపురం ద జెమ్ ఆఫ్ రాయలసీమ' పేరుతో ముద్రితమైన పుస్తకాన్ని రష్యాలోని కజాన్ నగర మేయర్ ఇలుసుర్ మెట్షిన్‌తో కలిసి మేయర్ వసీం ఆవిష్కరించారు. రష్యాలో బ్రిక్స్ దేశాల సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లిన మేయర్ వసీం శనివారం అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో అనంతపురం నగర విశేషాలు, జిల్లాలోని ప్రముఖ చారిత్రక ప్రదేశాలకు సంబంధించిన వివరాలను పొందుపర్చారు. అప్పట్లో విజయనగర సామ్రాజ్యంలో అనంతపురం, పెనుకొండలు పోషించిన పాత్రతో పాటు ప్రస్తుతం నగరంలో పాలక వర్గం గురించి, మేయర్ అధికారాలు, పరిపాలన, ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న పలు కార్యక్రమ వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ వసీం 'సాక్షి'తో మాట్లాడుతూ 'అనంత' ఘన చరిత్రను బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సులో తెలియజేసే అద్భుత అవకాశం తనకు దక్కడం సంతోషంగా ఉందన్నారు. అనంతపురం నగర ప్రజలు, తనకు మేయర్‌గా అవకాశం కల్పించిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పాలకవర్గానికి మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. రష్యాలో జిల్లా తరఫున ప్రత్యేకంగా మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు.

జగన్ వీరాభిమాని మృతి



మృతి చెందిన ఎర్రిస్వామి, చేతిపై జగన్ పేరు

గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేని జగన్ వీరాభిమాని ఒకరు మనోవేదనతో మృతి చెందాడు. జె.వెంకటాంపల్లికి చెందిన ఉప్పర ఎర్రిస్వామి (37)కి మాజీ సీఎం వైఎస్ జగన్ అంటే ఎంతో ఇష్టం. అభిమానంతో తన కుడి చేతిపై వైఎస్ జగన్ పేరును పచ్చబొట్టు వేయించుకున్నాడు. సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్యంగా ఎన్డీయే కూటమి గెలిచి అధికారంలోకి వచ్చింది. రెండో దఫా జగన్ సీఎం అవుతారని ఆశతో ఉన్న ఎర్రిస్వామికి ఈ ఫలితాలు నిరాశపరిచాయి. క్షేత్ర స్థాయిలో ప్రజాబలం మెండుగా ఉన్న వైఎస్సార్ సీపీ ఓటమిపాలవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఈవీఎంలలోనే ఏదో తేడా జరిగిందని, జగన్ సీఎం కాకుండా కుట్రలు చేశారని వాదిస్తుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకున్న ఎర్రిస్వామి (37) శనివారం ఉదయం ఎంత సేపటికీ నిద్ర లేవలేదు. భార్య లక్ష్మమ్మ లేపడానికి ప్రయత్నించినా ఆయనలో చలనం లేకపోవడంతో గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి పరిశీలించగా.. అప్పటికే ఎర్రిస్వామి మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు మృతదేహంపై పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎర్రిస్వామికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

గొర్రెల మందపై చిరుత దాడి

శెట్టూరు: చిన్నంపల్లిలో గొర్రెల మందపై చిరుత దాడిచేసింది. బాధితులు, ఫారెస్ట్ అధికారులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి గ్రామ చివరనున్న గొర్రెల మందపై చిరుత దాడిచేసింది. గొర్రెలు బెదిరి చెల్లాచెదురు కావడంతో గొర్రెలకాపరి లక్ష్మప్ప గట్టిగా కేకలు వేశాడు. దీంతో చిరుత అక్కడి నుంచి వెళ్లిపోయింది. అప్పటికే ఒక గొర్రె మృతి చెందడంతో ఫారెస్ట్ అధికారులు, పశువైద్యశాఖ అధికారులు శనివారం గొర్రెకు పంచనామా నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ ఎఫ్ఎస్ఓ జగనాథం, ఇన్‌చార్జ్ బీట్ ఆఫీసర్ వాణి పాల్గొన్నారు.

వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి


అనంతపురం రూరల్: మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనంతపురంలోని పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో ప్రవేశానికి ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం నగరానికి 5 కి.మీ. దూరం నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థులకు వసతి కల్పిస్తామన్నారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు తీసుకుని ఈ నెల 24లోగా విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 96669 55006 నంబరులో సంప్రదించాలన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ శిలాఫలకం ధ్వంసం



పామిడి: పొళ్యం గ్రామంలో శనివారం వేకువజామున డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనను వైఎస్సార్ సీపీ పామిడి మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కె.నారాయణరెడ్డి ఖండించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజాతీర్పును ఎవరైనా శిరసా వహించాల్సిందేనని అన్నారు. అంతేకానీ శిలా శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం మంచి సంప్రదాయం కాదని అన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై 'తమ్ముళ్ల' దాడి


గాయపడిన చెన్నారెడ్డి,రాజమోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి

తాడిపత్రి: బ్రాహ్మణపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్తలు శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి తెగబడ్డారు. బాధితుల కథనం మేరకు... వైఎస్సార్‌సీపీ కార్యకర్త చెన్నారెడ్డి ఇంటి ముందు గతంలో రోడ్డు నిర్మించారు. దీన్ని సహించలేని టీడీపీ కార్యకర్తలు కొండమ్మ గారి ఖాదర్‌బాషా, ఖలీల్, ఖాదర్ వలి అలియాస్ చిన్నోడు అప్పట్లోనే గొడవ పడ్డారు. శనివారం వర్షం కురవడంతో రోడ్డుపై నీరు నిలిచింది. దీన్ని సాకుగా పెట్టుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చెన్నారెడ్డి, రాజమోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చెన్నారెడ్డి భార్య సుగుణమ్మల ఇంటికెళ్లి దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి ఘటనపై బాధితులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు.

క్లుప్తంగా

నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి బాధ్యతల స్వీకరణ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నాగమణి శనివారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. అంతకు ముందు ఆమె ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు వద్ద రిపోర్టు చేసుకున్నారు. ఈనెల 21న విజయవాడలో జరిగిన కౌన్సెలింగ్‌లో గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఆమెకు గ్రేడ్–1గా పదోన్నతి లభించిన విషయం విధితమే. రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంలో స్టాఫ్‌నర్సుల పాత్ర కీలకం. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సూచించారు. అనంతరం నర్సింగ్ సూపరింటెండెంట్‌కు గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, హెడ్‌నర్సులు, తదితరులు అభినందనలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. డెంగీ, మలేరియా, అతిసార తదితర కేసులుంటే వాటిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. యూనిట్ ఇన్‌చార్జ్‌లు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఇన్‌చార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


కేజీబీవీలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ–2 ప్రసన్నకుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి–2 ప్రసన్నకుమార్ నాయుడు ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని దామాజిపల్లి, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలు అందరికి అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలను జాగ్రత్తగా ఉపయోగించుకుని బాగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పంపనూరులో నేడు ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజా కార్యక్రమాలతో పాటు, పంచామృతాభిషేకాలు, రాహుకేతు హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


ఆరోగ్యంపై సూచనలిస్తున్న డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రవినాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని హరియాన్ చెరువు గ్రామంలో 104 సంచార వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మందులను క్రమం తప్పక వాడాలని డాక్టర్లు సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నివాస ప్రాంతాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు చేరి నిల్వ ఉంటే అందులో దోమలు పెరిగి జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. అలాగే ఇళ్ల వద్ద మురికి నీటి గుంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఏఎన్ఎం అశ్విని, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు శ్రీకారం

- ఆముదం, కంది పంటలపై రైతన్నల ఆసక్తి
- ఏరువాక పౌర్ణమి సందర్భంగా విత్తన సాగు పనులు ప్రారంభం

ఆత్మకూరు: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఇటీవల విస్తారంగా వర్షాలు కురిశాయి. పొలాల్లో సేద్యం పనులు పూర్తి చేసుకున్న రైతన్నలు విత్తన సాగుకు సిద్ధమయ్యారు. శనివారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండల వ్యాప్తంగా చాలా మంది రైతులు తమ పొలాల్లో పంటలు వేసేందుకు శ్రీకారం చుట్టారు. ఉదయాన్నే పొలాలకు వెళ్లి ఎద్దులకు పూజలు నిర్వహించి టెంకాయ కొట్టి విత్తన సాగు పనులు మొదలు పెట్టారు. మండలంలో బోరు బావుల కింద కాకుండా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతుల సంఖ్య తగ్గుతోందని చెప్పవచ్చు. మండలంలో దాదాపు 50 వేల ఎకరాల వరకు సాగు భూమి ఉంది. గతంలో ప్రధాన పంటగా వేరుశనగ సాగు చేసేవారు. మండల వ్యాప్తంగా వేరుశనగ 35 వేల ఎకరాలు, కందులు 4 వేల ఎకరాలు, 15 వేల ఎకరాలకు పైగా ఆముదం పంటలు సాగయ్యేవి. ప్రస్తుతం వేరుశనగ సాగుకు రైతులు తక్కువ ఆసక్తి చూపుతున్నారు. చాలా మంది ఆముదం, కంది పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, కొర్ర, సజ్జ, పత్తి వంటి పంటలు వేసేందుకు ముందుకొస్తున్నారు. వారం రోజులుగా వరుణుడు తెరపి ఇవ్వడంతో ఎండకు తేమ తగ్గింది. విత్తన సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు చాలా మంది విత్తనాలు ముందుగానే సాగు చేస్తున్నారు.

పెరిగిన బాడుగలు..

ప్రస్తుతం ఎద్దులతో వ్యవసాయ పనులు చేయడం చాలా వరకు తగ్గిపోయింది. గతంలో ప్రతి ఇంట్లో రెండు జతల ఎద్దులు ఉండేవి. ప్రస్తుతం చాలా చోట్ల వీధికి ఒక జత ఎద్దులు కూడా కనిపించకుండా పోయాయి. యంత్రాలతో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ట్రిల్లర్, దున్నిన భూమిని గుంటుకతో పాయడం, మళ్లీ విత్తనాలు విత్తడం ఇలా ఎద్దుల కన్నా ట్రాక్టర్ల ద్వారానే ఎక్కువగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. గంటకు ట్రాక్టర్ బాడుగ ఒక్కో రకం వ్యవసాయ పనికి ఒక్కో ధరను ట్రాక్టర్ యజమానులు తీసుకుంటున్నారు.


విత్తన శుద్ధి చేస్తున్న రైతులు


ఎద్దులకు పూజలు చేసి పనులు ప్రారంభిస్తున్న రైతు

జాగ్రత్తలు తప్పనిసరి

ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి. విచ్చలవిడిగా రసాయన మందులు వాడకూడదు. అధికారుల సూచనలతో రసాయన, పురుగు మందులను మోతాదుకు మించి వాడకూడదు. జూలై నెలాఖరు వరకూ విత్తన సాగుకు అవకాశం ఉంది. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 2,850 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశారు. సబ్సిడీపై కందులు కూడా అందజేస్తాం. ఆసక్తి గల రైతులు విత్తనాలు తీసుకెళ్లాలి.

– సుచరిత, ఏఓ

వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు


యజమానులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ నారాయణ రెడ్డి

అనంతపురం: నగరంలో వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. శనివారం నగరంలోని కమలానగర్‌లో దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. ప్రతి షాపు ముందు నో పార్కింగ్ బోర్డు పెట్టాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌పైన సరుకు పెట్టిన యజమానులను మందలించారు. ఫుట్‌పాత్‌పైన వరకు సరుకు పెడితే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడతారని గుర్తు చేశారు. షాపు యజమానులు సహకరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నారాయణ రెడ్డి, ఎస్ఐ కొండయ్య, ఏఎస్ఐ రామాంజుల రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కే.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక పరిశోధన అభినందనీయం

- ఎస్కేయూ వీసీ ఆచార్య హుస్సేన్ రెడ్డి


పుస్తకావిష్కరణ చేస్తున్న రచయితలు, అధ్యాపకులు

అనంతపురం కల్చరల్: విద్యావేత్తగా, రచయిత్రిగా, వైజ్ఞానిక పరిశోధకురాలిగా డాక్టర్ ప్రగతి చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వీసీ ఆచార్య హుస్సేన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీలో డాక్టర్ ప్రగతి రచించిన ప్రతి ఫెయిల్యూర్‌లో ఒక గెలిచే దారి పుస్తకాన్ని పలువురు రచయితలు, కవులు, విద్యావేత్తలు ఆవిష్కరించారు. ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆచార్య హుస్సేన్‌రెడ్డి విశిష్ట అతిథిగా విచ్చేసి మాట్లాడారు. హిందూపురం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న మద్దూరు ప్రగతి చేసిన పరిశోధన అనుభవాలను సరళమైన భాషలో పుస్తకాన్ని రచించారని కొనియాడారు. అదే విధంగా డాక్టర్ అనంత మాలతి, సీనియర్ రచయిత తరిమెల అమరనాథ రెడ్డి, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రమేష్ నారాయణ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, మానవ హక్కుల రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రతి పరిశోధన సామాజిక ప్రగతి కోసం సాగాలని రచయిత్రి భావించడం వల్ల సైన్సు పరిశోధకులకు పుస్తకం దిక్సూచిగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మైక్రో బయాలజీ లెక్చరర్ పల్లవి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో సీనియర్ రచయిత్రి షెహనాజ్, ఎస్.ఎం.బాషా, డాక్టర్ ప్రసూన, డాక్టర్ అంకే శ్రీనివాస్, సుధామ వంశీ, ఉషారాణి, శివరాం, ఆచార్య వెంకట రమణ,కవులు చం.శాస్త్రి, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ ఏర్పాటుకు చర్యలు


కార్యక్రమంలో పాల్గొన్న ఎక్స్ సర్వీస్‌మెన్లు

అనంతపురం: మూడు నెలల్లోపు హౌసింగ్ సొసైటీ, అర్ధసైనిక కాలనీ కోసం డబ్ల్యూఏఆర్బీ తరపున ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆలిండియా సెంట్రల్ పారా మిలిటరీ ఫోర్స్ ఎక్స్–సరీ్వసుమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరుశురాముడు, కార్యదర్శి ఎస్. సుభాష్ తెలిపారు. శనివారం అనంతపురం నగరంలో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఏఆర్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఎస్ఎస్‌జీ, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ రిటైర్డ్ అయిన సభ్యులు పాల్గొన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎం.తిమ్మప్పను ఎన్నుకున్నారు. మహిళా విభాగం నుంచి వసుంధర, రమణమ్మ, వి.జయలక్ష్మిని సభ్యులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అభినేజర్, పీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో విష్ణు(4) అనే బాలుడు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా పెన్నానగరానికి చెందిన కార్తీక్, భార్య సత్య, బావమరిది మోహన్ హైదరాబాదు జీడిమెట్ల ప్రాంతంలోని ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో గత మూడేళ్లుగా హాట్ చిప్స్ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. పది రోజుల క్రితం సొంతూరుకు వెళ్లి ద్విచక్ర వాహనంలో తిరిగి హైదరాబాదుకు వెళ్తూ వన్నేదొడ్డి గ్రామ శివారులో డివైడర్‌ను ఢీకొన్నారు. ద్విచక్ర వాహనం నుంచి నలుగురు రోడ్డుపై ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో బాలుడు విష్ణు, మోహన్, కార్తీక్, సత్యకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ వైపు కారులో వెళ్తున్న ఇద్దరు వైద్యులు.. రోడ్డుపై పడి ఉన్న వారిని గమనించి కారులో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో విష్ణు మృతి చెందాడు. వైద్యుల సూచన మేరకు మోహన్‌ను అనంతపురం తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు విష్ణు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్ఐ నబీరసూల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైప్‌లైన్ ఏర్పాటుపై వివాదం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రాజహంస అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతంలో గతంలో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన కాలువ పైప్‌లైన్‌పై వివాదం చోటు చేసుకుంది. ప్రైవేట్ యజమానులు తమ స్థలంలో నడిమివంకకు సంబంధించిన పైప్ వెళ్లేలా ఏర్పాటు చేశారని.. తక్షణం వాటిని తొలగించాలంటూ స్థల యజమానులు శనివారం స్వయంగా జేసీబీతో గుంతలు తవ్వేలా చూశారు. విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ, పబ్లిక్ హెల్త్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని తవ్వకాలు జరగకుండా అడ్డుకున్నారు. పైప్ దెబ్బతింటే మురుగు సమస్య ఏర్పడుతుందని స్థల యజమానులకు తెలియజేశారు. చివరకు ఏసీపీ మారుతీ ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ సతీష్‌లు స్థల యజమానులతో మాట్లాడారు. సర్వే చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: మథనం కవితా సంపుటితో ఎంతో మందిని ఆకట్టుకున్న సీనియర్ కవి మధురశ్రీ కలం నుంచి మరో కవితా ఝరి జాలు వారింది. సరోజ గోవిందం సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడిగా మధురశ్రీ అనేక ఏళ్లగా సాహితీ సేవలందిస్తున్నారు. వివిధ సాహితీ సంస్థలలో బాధ్యతలున్న మధురశ్రీ తన సాహిత్య సేవా ప్రస్థానంలో అనేక అవార్డులందుకున్నారు. ఆ కోణంలోనే సామాజిక సమస్యలపై నిశిత దృష్టితో సాగిన 'శ్వాసతో యుద్ధం' కవితా సంపుటిని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో ఆవిష్కరించనున్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సభకు సీనియర్ రచయిత తరిమెల అమరనాథరెడ్డి అధ్యక్షత వహిస్తారు. జిల్లాలోని ప్రముఖ కవులు, రచయితలు విచ్చేస్తున్నారని జిరసం అధ్యక్షుడు డాక్టర్ జన్నె ఆనంద్ తెలిపారు.

నేడు నిర్విరామ భక్తి గీతాలాపన

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా మరో అద్భుత సంగీత కచేరికి సన్నాహాలు చేశారు. ఇప్పటి వరకు సాగిన సినిమా పాటలు, శాస్త్రీయ సంగీత కచేరీలకు భిన్నంగా మరో నిర్విరామ సంగీత భక్తిగీతాలాపన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీనియర్ గాయకులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధి కసిరెడ్డి సూర్యనారాయణరెడ్డి నేతృత్వంలో వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు స్థానిక లలితకళాపరిషత్తు వేదికగా ఆధ్యాత్మిక భక్తిపాటల కార్యక్రమం కొనసాగుతుంది పూర్తిస్థాయి భక్తిగీతాలాపనలతో ఏకబిగిన 14 గంటల పాటు నగరంలోని 40 కళాబృందాలతో భక్తిపాటలు పాడడానికి నగరవాసులను పాటల మాధుర్యంలో ముంచెత్తడానికి జిల్లాలోని గాయనీ గాయకులందరూ సిద్ధమయ్యారు. శ్రీ ఘంటసాల సంగీత కళాభారతి సహకారంతో సాగనున్న భక్తిసంగీతోత్సవంలో జిల్లా వ్యాప్తంగా కళాకారులు, రంగస్థల నటులు, సంగీత ప్రియులు భాగస్వాములవుతున్నారని నిర్వాహకులు సూర్యనారాయణ రెడ్డి, సురేష్ తెలిపారు. సమాజంలో ఆధ్యాత్మిక భావజాలం పెంచడానికి, సంగీతం ద్వారా కుల మతాల సామరస్యం చాటుతూ భక్తిపాటలతో ముంచెత్తే కళాకారులందరిని సత్కరిస్తామని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రేపు బైక్ ర్యాలీ

అనంతపురం ఎడ్యుకేషన్: చైతన్య విద్యా సంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీని నిరసిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 24న నగరంలో బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు ఉల్లికల్లు రమణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ శ్రీ చైతన్య విద్యా సంస్థల యాజమాన్యం ఇష్టానుసారంగా పుస్తకాలు అమ్ముతోందన్నారు. అడ్మిషన్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వీరి ఆగడాలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. పెద్ద ఎత్తున ఆందోళన చేయడంలో భాగంగా 24న బైక్ ర్యాలీ చేపడుతున్నామన్నారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ సమతుల్యం


మొక్క నాటుతున్న సమగ్రశిక్ష ఏపీసీ వైఖోమ్ నిదియాదేవి

అనంతపురం ఎడ్యుకేషన్: విరివిగా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం అభివృద్ధి చెంది పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని సమగ్రశిక్ష ఏపీసీ వైఖోమ్ నిదియాదేవి పేర్కొన్నారు. శనివారం ఏపీసీ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి చింత, వేప, సీతాఫలం, నేరేడు, కానుగ తదితర రకాల మొక్కలు దాదాపు 50కు పైగా నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అనంతపురం లాంటి కరువు జిల్లాలో విరివిగా మొక్కలు పెంచడమే సమస్యకు మొదటి పరిష్కారం అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొక్కలు పెంపకంపై విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. నీడనిచ్చే పచ్చదనాన్ని పెంపొందించే మొక్కలతో పాటు పుశుపక్షాదులకు ఫలాలను అందించే వృక్షాలను కూడా నాటాలన్నారు. కార్యక్రమంలో ఈఈ శంకరయ్య, సూపరింటెండెంట్ ప్రదీప్, సెక్టోరియల్ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, షమా, గోవింద రెడ్డి, గోపాల్, వాణీదేవి, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు మాధవరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, గురుముని కృష్ణ, రామ్‌ప్రసాద్ రెడ్డి, నారాయణ స్వామి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పరవాండ్ల కొట్టాల వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్టు (ఫైల్), చెట్టును తొలగించిన దృశ్యం

ఎండిన చెట్టు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఎన్ఎస్ గేట్ నుంచి ధర్మవరం వెళ్లే రహదారిలో ఉప్పరవాండ్ల కొట్టాల వద్ద 'ప్రమాదకరంగా చెట్టు' శీర్షికతో ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. శనివారం ఉప్పరవాండ్ల కొట్టాల బస్టాప్ వద్ద ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్టును అధికారులు తొలగించారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే చెట్టును తొలగించడంతో పలువురు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శేషంపల్లిలో చోరీ

- రూ.10 లక్షల నగదు, 3 తులాల బంగారు ఆభరణాల చోరీ
- బంధువులే దోపిడీ చేశారని బాధితుడి ఫిర్యాదు


శేషంపల్లిలో బీరువాను పగులకొట్టిన దృశ్యం

రామగిరి: భార్య తరపు బంధువులే తన ఇంట్లో దూరి రూ.10 లక్షల నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారని రామగిరి మండలం శేషంపల్లి గ్రామానికి చెందిన నరసింహ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం సత్యసాయినగర్‌కు చెందిన నాగేంద్రమ్మతో శేషంపల్లికి చెందిన నరసింహకు వివాహమైంది. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో శనివారం నరసింహ ఇంట్లోలేని సమయంలో భార్య తరపు బంధువులు శ్రీలక్ష్మి, తిమ్మయ్య, మౌనిక, శ్రీనివాసులు, నాగమణి, శ్రీలక్ష్మి, రామాంజినేయులు తదితరులు ఆటోలో శేషంపల్లికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి అందులోని రూ. 10 లక్షల నగదు, 3 తులాల బంగారు నగలు తీసుకున్నారు. అనంతరం ఇంట్లోని సామగ్రిని వీధిలో పారేసి వెళ్లిపోయారు. తర్వాత ఇంటికి వచ్చి చూసుకున్న నరసింహ.. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.


పూజలందుకున్న సరస్వతీ మాత


హోమం నిర్వహిస్తున్న అర్చకులు


సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

దీవించు.. సరస్వతీ మాత

జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా నగరంలోని శృంగేరీ శారదా మఠం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. వందలాదిగా తరలి వచ్చిన భక్తజనం చదువుల తల్లి సరస్వతీ మాతకు భక్తితో నీరాజనాలర్పించారు. చిన్నారులకు విద్యాభ్యాసంలో ఎటువంటి ఆటంకాలు రాకూడదన్న సంకల్పంతో ఉదయం గణపతి, సరస్వతీ, దక్షిణామూర్తి హోమాలను రుత్వికులు విద్యాధర శాస్త్రి, అమరనాథ శాస్త్రి శాస్త్రోక్తంగా జరిపించారు. అదేవిధంగా మధ్యాహ్నం పూర్ణాహుతి, ప్రసాద వితరణ పెద్ద ఎత్తున జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు బారులు తీరి సామూహిక కుంకుమార్చన చేశారు. విద్యార్థులతో కలిసి సరస్వతీ మాత జపపారాయణం చేపట్టారు. అనంతరం మఠం మేనేజర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. జగద్గురు పీఠం మహాస్వామి ఆదేశాలతో సువర్ణ భారతి మహోత్సవం జరుగుతున్న నేపథ్యంలో నగరంలోని శంకర మఠంలో కూడా విశేష కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు మార్తాండ శర్మ, ప్రభాకర భట్టు తదితరులు పాల్గొన్నారు.

– అనంతపురం కల్చరల్:

విద్యుదాఘాతానికి రెండు గేదెల మృతి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు శనివారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన పింజారి వన్నూరుసాబ్‌కు చెందిన రెండు గేదెలు మేత కోసం ప్రభుత్వ పాఠశాల వెనుక వైపు వెళ్లాయి. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ తీగలు తగిలి, రెండు గేదెలు మృతిచెందాయి.